# వివర్ణం

## గోపరాజు నారాయణరావు

**"బ్లాక్ బ్యూటీ ఆగయా!" ఆ మందలో అన్నారెవరో!.**

**కాలేజీ మెయిన్ గేటుకి కాస్త దూరంలోని స్కూటర్ స్టాండ్. వాహనాల దగ్గర నిలబడి, జారగిలపడి, కూర్చుని, ఆనుకుని వర్ణనాతీతమైన భంగిమలలో కొలువుతీరి కుళ్ళు జోకులు వేసుకుంటున్న ఆ విద్యార్థులంతా అలెర్టయ్యారు.**

జారిందో లేదో, లేకపోతే నవనాగరికతా విశ్వాసమో తెలియదుగానీ, ఎడం చేయి మధ్య వేలితో రేబాన్ గ్లాసెస్‌ని మతారంగా వెనక్కి నెట్టి, ఆపైన రాజా పోజుకొచ్చేశాడు ఆ టీన్‌ప్యాంట్.

దువ్వెన తీసి, లిప్తపాటు తనే రెండుసార్లు దువ్వేసి బ్రిమ్మయిపోయాడా టీషర్టు.

స్కూటర్ మిర్రర్‌లో అప్పటికే తన జిడ్డు ముఖాన్ని కర్చీఫ్‌తో బాగా రుద్దేసి ఎదురుగా నిలబడివున్నవాడి భుజం మీద గెడ్డం ఆన్చి ఆవైపే చూస్తున్నాడా పొట్టి మందరాంగుడు.

కొందరికి ఇలాంటి అవకాశం దక్కలేదు.

చూస్తూ వుండగానే ఈ రెమ్మమీద నుంచి ఆ పూలకొమ్మ మీద ప్రత్యక్షమయిన సీతాకోక చిలుకలా ఆ అమ్మాయి గేటు దాటేసి, ఈ స్టాండు దాకా వచ్చేసింది.

"వైట్ పంజాబీ డ్రెస్‌లో బ్లాక్ బ్యూటీ యమగుంది గురూ!" మందలో ఓ కళా హృదయం గొణిగింది. ఒకటే అరా గొంతుల్లో సిపీ సంగీతం భళ్ళుమంది.

ఆమె అడుగులకు తాళం వేస్తూ 'ఆహా', 'ఓహో'లు-

కొందరి దృష్టిలో దివ్యభారతి పోలికలు-

కొన్ని కళ్ళల్లో అమూ అగర్వాల్ ఆనవాళ్ళు.

ఆగి, ఉక్రోషంతో ఏదో అరచిందా అమ్మాయి. తర్జని చూపిస్తూ మరో అంది.

మంద బెదరలేదు. శ్రుతి మించిపోయింది.

కామెంట్స్‌కి పదును పెరిగింది. దురుసూ హెచ్చింది.

నల్లగా, నీటుగా వున్న ఆ అమ్మాయి అంగాంగాల పైకి అవి దూసుకొస్తుండగా కళ్ళ నీళ్ళతో పారిపోయింది ఆ చోటునుంచి.

******

"చరిత్ర బాదరాయణ! సత్యనారాయణా!"

క్లాస్ నుంచి వచ్చి, చాక్‌పీసు, టెక్స్ట్ బుక్కు సొరుగులో పడేసి కుర్చీలో కూర్చుంటున్నాను. అప్పుడే పిలిచారు సత్యారావు గారు.

ఇంటర్వెల్... అంతా చేరారు స్టాఫ్ రూంలోకి. ఒకప్పటి క్లాసు రూం. ఎదురుగా బ్లాక్ బోర్డు. దానిమీద ఒక పక్కగా, పై భాగంలో వేసివుంది తేదీ- 1995 జూన్4.

కాలేజీ తెప్పించే రెండు మూడు న్యూస్ పేపర్లని తలా ఒక ముక్క పంచుకుని పంఘ పఠనం చేస్తున్నారంతా!. అదీ దొరకని అభాగ్యులు శ్రమపడకుండా మంచుని, ఒంగుని ఎదుటివారి చేతులలోని పేపర్లని సాధ్యమైనంత మేర చదువుతూ తృష్ణ తీర్చుకుంటున్నారు.

లాభం లేదు. వేళ్ళకి అంటుకుపోయినట్టున్నాయి- న్యూస్ పేపర్లు.

'ఏమి'టన్నట్టు చూశాను సత్యారావుగారి దగ్గరకు వెళ్ళి.

చాలా సాలోచనగా ప్రశాంతంగా అన్నారాయన.

"ఇవాల్టి వార్త చూస్తే వాళ్ళ ముఖాలు ఎలా వుంటాయంటావ్?".

ఒక్క క్షణం అర్థం కాలేదు నాకు.

"ఎవరి ముఖాలూ! నాకేం చెబుతారా సారూ!" దీర్ఘం తీస్తూ తల దూర్చాడు మేథ్స్ పార్ట్‌టైం లెక్చరర్ రాజగోపాల్.

"ఈ కాలేజీలో నువ్వెప్పుడు చేరావ్?"

"ఈ సంవత్సరమే కదా సారూ!"

"అవి 'తొంభై మూడు'ముఖాలు. అంటే, నైన్టీత్రీ ఫేసెస్ అనుకునేవ్: అలాక్కాదోయ్ గణితం!. పందొమ్మిది వందల తొంభైమూడో సంవత్సరం నాటి ముఖాలన్నమాట. కాబట్టి నాటి తడాఖా నీకు తెలీదు. అంచేత ఊర్కో!!.

చలోక్తిగా అన్నారు సత్యారావు గారు.

తరువాత నాకేసి తిరిగి చిరుకోపం నటిస్తూ అన్నారు-

"నాళ్ళేనయ్యా! నల్లపిల్ల గొడవ, తర్వాత దండయాత్ర... అరే! హిస్ట్రీ మైనార్టీని ! నువ్వూ మరిచిపోతే ఎలా? ఎలాంటి ఘట్టం అదీ!"

చటుక్కున గుర్తొచ్చింది నాకు. అందంతా తలపుకొస్తే ఒళ్ళు జలదరిస్తుంది. నవ్వు వస్తుంది.

చేతిలోని పేపరు మడిచి నాకిచ్చారు సత్యారావు గారు.

లోపలి పేజీ అది. నేను రాజగోపాల్‌కు త్యాగం చేసేశాను.

పొద్దుటే ఇంటి దగ్గర పేపరు తిరగేశాను.

నిండా ఉత్తర ప్రదేశ్ రాజకీయ వార్తలే.

నిజం చెప్పాలంటే జీతాలు, జేపీకలు, డి.ఏ. పాయింట్ల నానకొట్టవలసిన స్టాఫ్‌రూం!. సాక్షాత్తు నాలుగో తేదీన రాజకీయ చర్చలతో అట్టుడికిపోతున్నది. ఎంత వైపరీత్యం?

అసలే వేడి వేడి రాజకీయ పరిణామం. ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీ సర్కార్‌కి కాన్షీరాం గారి బహుజన సమాజ్ పార్టీ విడాకులు ఇచ్చేసింది కదా! ఇది ఆషామాషీ సంగతి కాదు. దేశ రాజకీయాలని నిర్దేశించే ఉత్తర ప్రదేశ్ రాజకీయాల వ్యవహారం, రామ జన్మభూమి తర్వాత సకల సంచలనాలకి అదేగా పుట్టిల్లు.

అదిగో! దానికే మా సత్యారావు గారు తన వ్యాఖ్యానాలతో పేపర్ల నాళ్ళను మించిపోయి రెండ్రోజుల నుంచి స్టాఫ్ రూం జనాన్ని కుతకుతలాడిస్తున్నారు. నిజానికి మా సత్యారావు గారు ఇప్పుడిప్పుడే ఇలా సడక్ఛాప్ రాజకీయవేత్త అవతారం దాల్చారు గాని, ఒకప్పుడు ఆయనా క్రియాశీలక రాజకీయుడే మరి! ఎన్టీ రామారావు రద్దుల పద్దులో రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌ని కొట్టి పారేయడంతో సత్యారావుగారి ఎమ్మెల్సీ యోగం మూణ్ణాళ్ళ ముచ్చటగా ముగిసిపోయింది. లేకుంటే ఆయన రాజకీయ భవిష్యత్తు ఎలా వుండేదో మరి! పాపం! ఇలా రాజకీయాల గురించి విశ్లేషిస్తూ, విమర్శిస్తూ మా కాలేజీలోనే కాలక్షేపం చేస్తున్నారు. టీచర్స్ కానిస్టిట్యూయెన్సీ నుంచి కౌన్సిల్‌కి వెళ్ళిన సత్యారావు గారు మా అందరికంటే సీనియర్. ఆయన రాజకీయ పరిజ్ఞానం కూడా నిజానికి అమోఘం. సబ్జెక్టూ పొలిటిక్సేనాయె! అందుకే ఇలాంటి [illegible] మహా పరిణామాలు జరిగితే ఆయనకి పండగ. అనర్గ[illegible] తన వాగ్ధాటితో మమ్మల్ని నుంచినీళ్ళు కూడా తాగనివ్వరు.

బెల్లు కొట్టారు.

వదలలేక వదలలేక సీట్లన్నీ విడిచి పెడుతున్నారు ఒకొక్కరు.

ఇంక నాకు అవర్స్ లేవు.

కాఫీ అడిగితే ఫ్లాస్కులో వున్నది పోసిచ్చాడు బోయ్.

ఆ వార్తలు, చర్చలు, మధ్యన సత్యారావు గారి మాట అప్ర యత్నంగానే అప్పటి ఒక ప్రభంజనానికి చెందిన దృశ్యమాలికని నా కళ్ళ ముందు కదలాడించాయి.

*** *** *** **** ***

టీజింగ్–

విద్యాలయాల్లో అదో మామూలు సంగతి. కాని, సాధార ణమైనవి అనుకునే సంఘటనలు, సంగతులు ఒక్కొక్కసారి నాపకింద నీరులా ముంచుకొచ్చిన పరిణామాలకి కూడా సంకే తాలనందిస్తాయి. అంతే కాదు. ఆ పరిణామాల ప్రభావం ఎంత తీవ్రంగా వుందో మనుషుల అనుభవంలోకి తెస్తాయి కూడా.

మా కాలేజీలో జరిగిన నల్లపిల్ల సంఘటన చేసింది ఇదే.

ఆ స్టూడెంట్ని బ్లాక్‌బ్యూటీ అంటూ ఆ ఫైనల్ డిగ్రీ మంద టీజ్ చేసిన మాట నిజమే. అంతకు ముందూ ఇలాంటి ఫిర్యాదులే చేసిందా అమ్మాయి.

కాని ఈ సంఘటన జరిగినప్పుడు సొసైటీ పరిస్థితి, అందునా విద్యార్థిలోకం స్థితి చాలా సెన్సిటివ్‌గా వుంది.

అంతా మండల్ మహత్తు!

చాలా చోట్ల విద్యార్థులు రెండు వైరి శిబిరాలుగా చీలిపోయి వున్నారు.

ఒక ఉప్పెన లాగే పెల్లుబికిన మండల్ వ్యతిరేకోద్యమం మా కాలేజీని మలభంగానే తాకింది. ఇది అగ్ర కులాలదని ఎలాగూ ముద్ర వుంది. అంతే కాదు. సంఘపరివార్‌కు అనుబంధంగా వుంటుందనే పేరుంది. ఇక వేరే చెప్పాలా!

మండల్ రిజర్వేషన్లకి వ్యతిరేకంగా ఢిల్లీ యూనివర్శిటీ కుర్రాడు రాజీవ్ గోస్వామి ఆత్మాహుతికి యత్నించడం దేశ లోనే గగ్గోలు పుట్టించింది. తరువాత ఒకరా? ఇద్దరా? అరవై మూడు మంది – విద్యార్థులు, విద్యార్థినులు– ఆత్మాహుతి చేసుకున్నారు. మండల్ రిపోర్టు దుమ్ము దులిపిన వీపీ సింగుని పత్రికలు తూర్పార పట్టాయి. ఇక ఆత్మాహుతి చేసుకునే తెగువ విద్యార్థిలోకానికి లేదనుకోకండన్నట్టు హైదరాబాద్‌లో నుసర్ల వంశీ మోహన్ ఒంటికి నిప్పంటించుకున్నాడు. రాష్ట్రం ఉడుకెత్తిపోయింది.


"ఏమయినా సత్యనారాయణ! ఓట్ల కోసం, కుర్చీని కాపాడుకోవడం కోసం ఇంత నీచానికి దిగిన రాజకీయ నాయకుడు చరిత్రలోనే లేడయ్యా!"

'ఇండియా టుడే'లో ఇలాంటి చావుల గురించి చదివి చలించిన సత్యారావుగారు అన్నారు.

"కానీ, వీపీ సింగు చెబుతున్న సోషల్ జస్టిస్ సంగతి గురించి మీకు పట్టదు కాబోలు!"

స్టాఫ్‌లోనే ఎవరో అన్నారు

"ఇదే సోషల్ జస్టిసా? సమాజాన్ని రాజకీయాల కోసం చీల్చేసి, ఒకరి మీద ఒకర్ని ఉసిగొల్పడం అన్నమాట. అసలు దేవీలాల్ ఢిల్లీలో ఊరేగింపు తీశాక, తన పదవి హుష్‌కాకి అయిపోతుందనుకున్నప్పుడే ప్రధాని గారికి సోషల్ జస్టిసు ఎందుకు గుర్తొచ్చింది! ఎన్నికల ప్రణాళికలో చెప్పలేదు. ఇప్పుడు మద్దతిస్తున్న వాళ్ళకయినా చెప్పా పెట్టకుండా తాను



దెబ్బకి ఇలా...

ఒక ఉపన్యాసమే చేశారు సత్యారావు గారు.

కాని ఇలా విషయాన్ని ఆయన అంత సీరియస్‌గా అవతలి వాళ్ళు అప్పటికి తీసుకోలేదు. వాదన తప్ప. మళ్ళీ ఎవరో అన్నారు–

"జన సంఘం వాళ్ళు ఇలాగే అంటార్లెండి!"

"ఇష్టం వచ్చినట్టు మాట్లాడొద్దు! ఇదేదో నా ఒక్కడి అభిప్రాయమో, జన సంఘం అభిప్రాయమో అనుకుంటున్నట్టున్నారు. మండల్ సిఫార్సుల గురించి ప్రతి పార్టీ లోను భిన్నాభిప్రాయాలున్నాయి. ఆ మేగ్జయిన్, అదేదిటి, గుర్తు రావడం లేదు ఎప్పటిదో, ఏం రాసిందో తెలుసా మీకు? ఆత్మహత్య చేసుకున్న ఓ స్టూడెంట్ నోటంట వచ్చిన చివరి మాటలవి! ఏమన్నాడో తెలుసా! రిజర్వేషన్లు ఓటు బ్యాంకులుగా చూస్తున్న వి.పి. సింగు, పాశ్వాన్, యాదవ్ వంటివాళ్ళే నా మరణానికి కారకులు అని స్పష్టంగా చెప్పాడు. వెళ్ళి చూస్కోండి!"

ఇలాంటివి క్లిప్పింగ్‌లతో సహా చూపించగలరాయన. ఎవరూ మాట్లాడలేదు.

ఎంత అగ్ర కులాల కాలేజీ అని బ్రాండు వున్నా అనూహ్యంగా మా కాలేజీలోనూ మండల్ అనుకూల స్వరం వినిపించింది. ఇక్కడే అని ఏముంది! యువత మొత్తం రెండు వర్గాలుగా రూపొందుతూ, చీలిక అంచున నిలబడ్డారని చెప్పడం సత్యదూరం కాదు. మళ్ళీ ఆ పల్లపిల్ల టీజ్ సంఘటనే ఉదాహరణ. ఆ పిల్ల రంగు, ఆమె స్నేహితురాండ్ర 'కేటగిరి'– అంతా అగ్రకులాల వాళ్ళే అయిన కుర్రాళ్ళు టీజ్ చేయడానికి దారితీసిందంటే వేరే చెప్పాలా!

ఇది నిజమేనని ఆ టీజింగ్ సంఘటన ఫాలో–అప్ చెప్పక చెప్పింది.

అదిగో! ఆ ఫాలో–అప్‌ని, దానికి నేపథ్యాన్ని కూర్చిన వాతావరణాన్ని తల్చుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది నాకు. బాధ, జుగుప్స కలుగుతాయి.

అగ్ర కులాలు– దళితులు.

ఇన్నాళ్ళూ కష్టపడి నిలబెట్టిన కుల రాహిత్యమనే ఒక బలవంతపు బ్రాహ్మణార్థాన్ని, ఆదర్శాన్ని అప్పుడు సమాజం వదిలించుకోవాలని భావించినట్టు కనిపిస్తుంది. విద్యాలయాలలో కులం ప్రవచన్న పాఠ్యాంశమే అయింది. కొన్ని శతాబ్దాల సాంఘిక వైరుధ్యాలు చివరికి భారతీయ సమాజాన్ని చీలిక దిశగా తీసుకుపోతున్నాయేమోనని, కనీసం అందుకు బీజాలు వేస్తున్నాయేమోనని, కొన్ని క్షణాలయినా నమ్మేటట్టు చేసిన వాతావరణమది. శవాలు, జీవచ్ఛవాలు– ఆవేశంతో ఒళ్ళు కాల్చుకొని ప్రాణాలొదిలిన విద్యార్థుల ఫొటోలు; కాలిన గాయాల మధ్య మృత్యువుతో పోరాడుతున్న వాళ్ళ ఫొటోలు; రోదించే కన్నవారి ఫొటోలు– పత్రికలు, మేగ్జయిన్లు ప్రచురిస్తున్నాయి.

ఇక మండల్ ఉద్యమ రెండవ వైపు దృశ్యం ఇది.

'వర్గం' అనే అభేద్య రాజకీయ, సాంఘిక, ఆర్థిక సైద్ధాంతికాంశానికి కొత్త పరిధిని ఇచ్చినది–మండల్ ఉద్యమమే. తమ హక్కుల కోసం, ఉనికి కోసం ఏకమైన బడుగు కులాల ఐక్యతని 'వర్గం'గా చూసే దృష్టిని, గుర్తించే సాహసాన్ని ఇచ్చిన సంఘటన కూడా ఈ ఉద్యమమే.

ఇలాంటి ఉద్రిక్త సన్నివేశం ఒక్కసారిగా ఫ్రీజ్ అయింది.

అది కూడా మరో దృశ్యంతోనే!


అదే–అద్వానీ అయోధ్య రథయాత్ర.

రామమందిర్ తారకమంత్రమయింది.

ఎక్కడ విన్నా – 'జై శ్రీ రాం!' 'జై శ్రీ రాం!'

వాస్తవానికి, మండల్ నుంచి మందిర్ వరకు సాగినది– కాస్త ప్రయాణం. కాని ఎన్ని మలుపులు!? ఆ కాస్త ప్రయాణం ఒక పరిణామాల పరంపర.

వీపీసింగ్ దిగిపోయాడు. చంద్రశేఖర్ ప్రధానమంత్రి అయ్యాడు. అనుకున్నట్టే ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల ప్రచారంలోనే రాజీవ్ గాంధీ హత్య. బీజేపీ ప్రభంజనం కాస్తా సలచబడి కాంగ్రెస్‌కు సింపతీగా మారిపోయింది. చావు తప్పి మైనారిటీగా కేంద్రంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం ఏర్పడింది. ఈయన హయాంలోనే మందిర్–మసీదు నేల కూలింది. అయోధ్య శిథిలాలతోపాటే ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ అధికారమూ మట్టికరచింది. ఆ అసెంబ్లీకి మళ్ళీ ఎన్నికలొచ్చాయి. ఏ అయోధ్య బాణంతో ముందు తాను కూలిపోయాడో, అదే బాణాన్ని వ్యతిరేకంగా మలచుకొని ములాయం సింగ్ ముఖ్యమంత్రి అయ్యాడు. మతం కోటని కులం ఖడ్గంతో ఛేదించిన వీరుడిగా కీర్తి పొందాడు.సరిగ్గా ఇక్కడే తిరిగిన ఒక మలుపు దేశాన్ని కుదిపింది. బడుగులకు ఏకైక ప్రతినిధిగా వున్న కాన్షీరామ్ బహుజన సమాజ్ పార్టీకి అర్ధ సింహాసనం ఇచ్చాడు ములాయం. దేశంలో దళిత వేవ్ ప్రారంభమై, కదిలింది – 'జై మీ!' 'జై జై భీమ్!' అంటూ.



సిగ్గు

పిక్ పాకెట్ చేస్తున్నందుకు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు ఓ ముద్దాయిని.

ఇలా జేబులు కత్తిరించి సంపాదిస్తున్నావు నీకు ఒక్కసారయినా సిగ్గు అనిపించలేదా? అన్నాడు జడ్జి గారు.

అప్పుడప్పుడు సిగ్గనిపిస్తుందండీ. కత్తిరించి సంపాదించిన పర్సులో ఒక్క పైసా కూడా లేకపోతే సిగ్గే కదండీ మరీ! అన్నాడా వ్యక్తి.

– కాట్రగడ్డ వెంకట్రావు.

ఆ మలుపు తిరిగిన ఆ క్షణంలో–

'మేం కోరుకునేది బ్రాహ్మణ వీధిలో చిన్న చోటు కాదు. రాజ్యాధికారం' అని దళిత సాంధర్ప చెప్పకునే సంకల్పం ఏ కొందరికయినా తలపునకొచ్చి వుంటుంది. ఆ క్షణమే – దళిత శక్తిని ఉత్తేజపరిచిందన్నమాట వాస్తవం. అందుకే ఇదంతా పార్లమెంటరీ రాజకీయాల రొచ్చు అని కొట్ట పారేయడానికి ఎవరూ సాహసించలేదు. ఇన్నేళ్ళ బడుగు జనోద్ధరణ నినాదం ఓ బూటకమని నిశ్చయించుకున్న దళిత మేధస్సు 'ఓట్లు మావి, సీట్లు మీవా?' అంటూ విసిరిన సవాలుకు దళిత జనం ఇచ్చిన జవాబుగానే ఆ పరిణామాన్ని మన్నించారు.

"ఇలాంటి సన్నివేశానికి దశాబ్దం కిందే మన రాష్ట్రంలో రంగం తయారయిందన్నమాట నిజం. ఇప్పుడు తెలుగు సాహిత్యాన్ని శాసిస్తున్న దళిత ప్రవాహ దాని ఫలితమే!".

ఆ రోజున ఎవరో మొదలుపెట్టారు చర్చ. అది కాస్తా దళిత సాహిత్యం పైకి మళ్ళింది. అప్పుడు మా తెలుగు హెడాఫ్‌ది డిపార్ట్‌మెంట్ శ్రీరామారావు గారు అన్నమాటలవి.

'దశాబ్దం క్రితమంటే!, ఆ ల్యాండ్‌మార్కేమిటి?"

స్టాఫ్‌లోనే ఎవరో అడిగారు.

"కారంచేడు".

ఇక ప్రశ్నల వర్షం.

"ఇంతకు ముందు దళిత సమస్యల గురించి ఉద్యమాలు జరగలేదని కాదు. కాని, కారంచేడు సంఘటన ఇప్పటి దళిత తరంలో తెచ్చిన ప్రవాహ ప్రత్యేకమైనది. ఆ తర్వాత జరిగిన కంచికచర్ల, నీరుకొండ, చుండూరు వంటి సంఘటనలతో దళిత ప్రవాహ, ఆ స్థాయిని అధిగమించి ఆవేశంగా మారింది. రాజకీయ స్వభావాన్నే తెచ్చుకుంది. ఆస్వభావం అప్పటికి కాన్షీరామ్ బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలకి సమాంతరంగా వుండడం యాదృచ్ఛికం" అన్నారు మాస్టారు.

తరువాత కవిత్వం మీదికి మళ్ళింది చర్చ–

'శంబూకుడు పెదాల మీద చిరునవ్వుతో రాముణ్ణి వధిస్తున్నాడట. 'ఏక లవ్యుడు ద్రోణుని బొటన వేలును గొడ్డలితో నరుకుతున్నాడట. మనువు కళ్ళలో మాదులు గుచ్చుకొని నాలుక తెగ్గోసుకొని స్మశానంలో దొర్లుతున్నాడట.

శివసాగర్ రాసిన ఈ కవిత చదివి వినిపించేసరికి స్టాఫ్ చాలామంది నివ్వెరపోయారు.

"ఇదంతా హిందువుల విశ్వాసాల మీద దాడే కదండీ!"

ముందు సత్యారావు గారే రియాక్టయి అన్నారు.

చాలా తాపీగా చెప్పారు శ్రీరామారావు గారు.

"ముమ్మాటికీ!"

మరింత ఉత్సుకత అందరిలో.

"నిజానికి వాళ్ళ ఎజెండాలో అదొకటి. పౌరాణిక సంఘటనని, పురాణ పురుషుల మహత్యాన్ని ప్రత్యేకంగా తీసుకుని వాటిని తల క్రిందులుగా చూపించి చరిత్ర తిరగబడుతున్న పరిణామాన్ని చెబుతూ వుంటారు. ఈ కవిత ధ్యేయం అదే" అన్నారు శ్రీరామారావు గారు.

మళ్ళీ ఆయనే అన్నారు

"అసలు 'బ్రాహ్మణీజం' పేరుతో హిందూయిజం మీదనే దళిత కవిత నిప్పులు కురిపించింది. తమని ఇన్నాళ్ళూ ఊరి వెలుపల నిలబెట్టిన వ్యవస్థతో, ధర్మంతో అమీతుమీ తేలచుకోదానికి దళితులు బరిలో నిలిచిన నేపథ్యంలో వస్తున్న కవిత్వమిది. జాషువా గారు దళితుడి దుస్థితిని బాధతో విన్నవించారు. ఇప్పటి దళిత కవికి కావలసినది – ప్రతీకారం తీర్చుకోవడం. అందుకే రాముడంటే పగ. మనువంటే మండిపాటు. శంబూకుడు, ఏకలవ్యుడే వాళ్ళ హీరోలు...

ఇంకా ఏదో చెబుతూ వుండగానే ఎవరో అడిగారు.

"మతం మత్తు అని చెప్పే కమ్యూనిస్టులు, మతమే

తమ పాలిట విపత్తు అని నమ్మినట్టు కనిపిస్తున్న దళితులు కలిశారా?"

ఒక్క క్షణం ఆలోచించి అన్నారు శ్రీరామారావు గారు.

"నాకు తెలిసి దళితులలో కొత్తతరం మార్క్సిజాన్ని తిరస్క రించడంలేదు. మార్క్సిస్టులను మాత్రం నిలదీశారు. అసలు దళిత చైతన్యానికి మూలం ఆ ఇజమేనన్న నమ్మకం వాళ్ళలో కనిపిస్తుంది కూడా. కాని అంబేద్కరిజమే వాళ్ళ సిద్ధాంతం. కాని ఒకటుంది. అంబేద్కరిజం ఆగిపోయిన చోటునుంచి మార్క్సిజంతో ముందుకు పోగాలన్నది వాళ్ళ వ్యూహంలా కనిపిస్తుంది. ఇదే సమాజంలో కొన్ని కొత్త ఈక్వేషన్స్‌ను లాక్కొచ్చింది, ఈ కవితలు చూడండి!".

డైరీ తీసి, అందులో నోట్ చేసిన కొన్ని విప్పించాడు.

'తరతరాల పేరుతో నాడు వన్ను కట్టిపడేస్తే/ ఉపరితలం పేరుతో నీవు నా నోరు నొక్కుతున్నావు./ సంస్కృత శ్లోకాలతో నాడు, పడికట్టు పదాలతో నీవు' అని ఒక కవి అన్నాడు. ఇంకో దళిత కవి ఏమంటున్నాడో చూడండి!. నేను జెండా మోసి/ నేను పార్టీని పెంచి/ జీవితమంతా సేవ చేయ/ నాయకత్వమెన్నడూ నాకు దక్కకపోయె/ విప్లవానికోటి వెట్టినయితి' అని విలపిస్తాడీయన. ఇదిగో, ఈ కవయితే మరింత స్పష్టంగా ప్రశ్నించాడు. గమనించండి ఎలాగో!. 'భూస్వాములు తన అస్తులనొదులుకోనట్టే/ మీరు మీ నాయకత్వాన్ని వదులుకోలేరని/ మాకు బాగా తెలుసు కామ్రేడ్!' అంటున్నాడు. అగ్రవర్ణాల ఆధిపత్యం లోని రాజకీయాలని కాదు, సాహిత్యంలో ఇదే ధిక్కార స్వరం వినిపించారు వాళ్ళు. గురజాడ కూడా బ్రాహ్మణవాద రచయితే అయ్యాడు. ఉన్నవ వారి 'మాలపల్లి' బ్రాహ్మణ మాలపల్లి అయింది. కాన్షీరామ్ తిట్ల పురాణం తెలుసు కదా! కమ్యూనిస్టులు, నక్సలైట్ గ్రూపులని కూడా ఆయన బ్రాహ్మణవాద గాట కట్టాడు. అయితే బ్రాహ్మణవాదంతో, మనువాదంతో కాన్షీరామ్ బీజేపీకి అగ్రతాంబూలం ఇస్తాడు".

చాలామంది అసహనంగా కదిలారు.

శ్రీరామారావు గారు చెప్పిన దానిని తరువాత చాలామంది ఆలోచించినట్టు కనిపించింది. వాకయితే ఒక్క విషయం బాగా వచ్చింది. ములాయం ప్రయోజనం ఏమైనప్పటికీ, మండల్ ఉద్యమంతో రేగిన ఆవేశం, ఉత్తరప్రదేశ్‌లో దళిత సంకీర్ణం, దళితులంటే ఎవరు? అన్న నిర్వచనం – మొత్తానికి దళితుల మధ్య దట్టంగా వున్న మానసిక అంటరానితనాన్ని ఆవేర్కి ఉపశమింపజేయగలిగింది. యూపీ ప్రయోగం తరువాత తెలుగు దేశంలో కూడా దళిత పోరు మొదలయింది. అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించడం కాకుండా నరనరాన దాడిచేసే పరిస్థితి ఏర్పడింది.

అదిగో అలాంటి ముహూర్తంలో జరిగింది వల్లపల్లి సంఘటన, దాని ఫాలో-అప్. అదీ మా కాలేజీలో. సంఘపరివార్, అగ్రకులాల అనుబంధమని ముద్ర వున్న మా కాలేజీలో జరిగింది.

బీజేపీని వెంట తరమడానికి కూడా బీఎస్పీ అభిమానులు వెనుకాడలేదు. ఆరోజున యూనివర్శిటీలో బీజేపీ స్థానిక నాయకత్వం ఏర్పాటు చేసిన సెమినార్‌ని పరమ అవమానకరంగా బహుజన్ సమాజ్ ఫ్రంట్ విద్యార్థులు భగ్నం చేయడమే ఇందుకు నిదర్శనం. ఆడ, మగ అని ఆలో చించలేదు. అందరినీ కుర్చీలలోంచి ఈడ్చారు. కాన్షీ తిట్ల దండకం యావత్తు ప్లే కార్డుల మీదికి ఎక్కించారు.

'బొట్టు పెట్టుకునే బ్రాహ్మణ్ణి తన్ను!'

'కత్తి పట్టావని చెప్పే క్షత్రియుణ్ణి నరుకు'

'బీజేపీ బ్రాహ్మణ వాద, మనువాద పార్టీ'

మళ్ళీ అవే నినాదాల

పోలీసులు రంగప్రవేశం చేస్తే గాని పరిస్థితి చక్కబడలేదు. అంటే – దళిత జనం అగ్ర కులాల ఆధిపత్యాన్ని ప్రశ్నించడం కాదు, దాడి చేయడంతో ఎదుర్కోవడం మొదలయింది.

విద్యాలయాల్లో ఇంత వేడి వున్నప్పుడు ఆ వల్లపల్లి సంఘటన అనుకోకుండా జరిగిపోయింది. అదీ మా కాలేజీలో.

ఇప్పుడు గుర్తుకొస్తున్నది పూర్తిగా. వల్లగా వున్నా కళయిన



పిచ్చి

పిచ్చాసుపత్రిలో వున్న ఒక పేషెంట్‌కి కొంచెం పిచ్చి నయమైందని భావించి మిగిలిన వారికి వంట చేసి పెట్టే బాధ్యత అప్పగించారు.

వాడు ఒక రోజు రెండు బ్రతికివున్న కోళ్ళను చేతిలో పట్టుకొని బలవంతంగా మరిగే నీళ్లలో ముంచబోతుండే సరికి "ఏం చేస్తున్నావ్?" కంగారుగా అడిగాడు డ్యాక్టర్.

వీటి చేత బాయిల్డ్ ఎగ్‌లు పెట్టిస్తున్నా సార్ అనే సరికి వాడిని తీసుకెళ్ళి మళ్ళీ వార్డ్‌లో పడేశారు.

– కాట్రగడ్డ వెంకట్రావు.

ముఖం. వయసుకు మించిన శరీర సౌష్టవం. విపరీతమైన మేకప్. పైపెచ్చు అప్పుడొచ్చిన ఒక సినిమాలో పల్లెటూరి హీరోయిన్ ప్రయోగించే ఊతపదాన్ని విరివిగా వాడేదా పిల్ల. లెక్చరర్లతో మాట్లాడినా అంతే అనేవారు. అప్పుడు ఆ పిల్ల ఒక చర్చనీయాంశం.

కప్ప పక్కన పెట్టి పేపర్లు తీశాను.

అదేదో లోపలి పేజీ. కాని, ఆ ఫోటోలు ఆకర్షించాయి.

బీజేపీ అగ్ర నేతలతో కరచాలనం చేస్తున్న కాన్షీరాం ఫోటో అది. వాజ్‌పేయీ,సుష్మ,కల్యాణ్ సింగ్ ఇంకా ఎవరో వున్నారు. దానికి కాస్త పైన మరో ఫోటో. అయోధ్య రథికుడు అద్వానీతో దళిత బాంధవుడు కాన్షీరాం రాజకీయ చర్చలు జరుపుతున్న దృశ్యం.

బెల్లు మోగిందిది.

నాలుగో అవర్ కూడా అయిపోయింది.

సత్యమూర్తిగారే వస్తున్నట్టున్నారు. బిగ్గరగా మాటలు విన్పిస్తున్నాయి.

ఆయన వెంట నడుస్తూ ఇంగ్లీష్ మేడం శాంత గారు అంటున్నారు.

"అంత సులభంగా ఎలా కలపిపోతారండీ! ఆఖరికి అసెంబ్లీలో కూడా తన్నుకున్నారు కదా!

"చూడమ్మా! ఓటియన్స్ ఛేంజ్ అయితే గాని రాజకీయం కాదట!. మన గిరీశం అంటాడులే!. ఇదీ అంతే!".

"అది కాదు సార్! రేపు ర్యాంక్ అండ్ ఫైల్ ఎలా పని చేస్తుంది?" ఎలా తలెత్తుకుంటుంది?"

"అదిగో, దాని గురించే తల్లీ! ఇంత క్రితమే అనుకున్నాం!" అన్నారు సత్యారావు గారు.

అప్పుడే ఎవరో రొప్పుకుంటూ లోపలికి చొరబడ్డాడు రాజగోపాల్. వస్తూనే చాక్‌పీసు, టెక్స్ట్ బుక్కు డ్రాయర్ మీద పడేసి, కుర్చీ లాక్కొని సత్యారావు గారి ముందు కూర్చున్నాడు.

"అదేదో మళ్ళీ చెప్పండి సారూ!" అన్నాడు.

"ఇది వల్లపల్లి స్టోరీ కాదులేవోయ్! అదయితే నువ్వొచ్చేదాకా ఆగకపోతే చంపెయ్యవూ! అయినా పాతాలు చెప్పే వయసులో కూడా అమ్మాయిల గొడవలంటే అంత బులబాటం ఎందుకయ్యా రాజగోపాలా!"

నవ్వుతూ అన్నారు సత్యారావు గారు.

శాంతి గారూ నవ్వేశారు

"వేరే ఉద్దేశం కాదు సారూ! ఇంత కాలం తర్వాత కూడా ఆ సంఘటన మీరు మరచిపోలేదంటే అదెంత హారర్, టెర్రర్ స్పెషల్ స్టోరీయోనని అడుగుతున్నాను". వేలి వేళ్ళ చాక్ పౌడర్‌ను ఊదుకుంటూ అన్నాడు రాజ గోపాల్.

"స్పెషాలిటీ వున్న మాట మాత్రం నిజం" అంటూ వల్లపల్లి సంఘటన రెండు ముక్కల్లో చెప్పి, ఫాలో- అప్ స్టోరీని మాత్రం కళ్ళకు కట్టినట్టు చెప్పారు సత్యారావు గారు.

*** *** ***

ఆ రోజు సెకెండవర్ కూడా మామూలుగానే జరిగిపోయింది. థర్డ్ అవర్ మొదలై సావుగంటయింది. అప్పుడే హటాత్తుగా గందరగోళం మొదలయింది.

"దళిత విద్యార్థుల ఐక్యత" ఎవరిదో గొంతు.

"వర్ధిల్లాలి... వర్ధిల్లాలి..." వెనక కొన్ని కంఠాలు.

"దళితులపై దాడులు ఇంకానా?"

'ఇకపై సాగవు.....ఇకపై సాగవు!"

"అగ్ర కులాల దౌర్జన్యాలు'

"నశించాలి... నశించాలి"

"జై భీమ్!"

"జై జై భీమ్!"

ఒక్క సారిగా కాంపౌండ్‌లోకి ఎగబడి మెయిన్ బిల్డింగ్‌ని చుట్టుముట్టారంతా. దాదాపు డెబ్బయ్ మంది. అంతా యూనివర్శిటీ స్టూడెంట్స్. స్లోగన్స్‌ను బట్టి బహుజన సమాజ్ ఫ్రంట్ వాళ్ళనిపిస్తోంది.

చాలామంది చేతుల్లో రాళ్ళున్నాయి. గ్రౌండ్‌లోని చెట్టు కొమ్మలు ఇంకొందరి చేతుల్లో ఆయుధాలుగా మారిపోయి వున్నాయి. క్లాసులని చూడగానే రెచ్చిపోయారు.

ముందు ఒకడు అరుస్తున్నాడు.

"ఎవడా లం..కొడుకు? దమ్ముంటే ఇప్పుడు కుయ్యమనండా కూత! బ్లాక్ బ్యూటీ కావాలా? లం.. కొడకుల్లారా! రండి"

శివమెత్తి అరుస్తుంటే బిల్డింగ్ ప్రతిధ్వనిస్తోంది. వెంటనే మరొకరు అందుకున్నారు.

"దళితులంటే ఏటనుకున్నార్రా కొజ్జావాకొడుకుల్లారా! మా వాళ్ళ పిల్లని ఏడిపిస్తార్రా..?! ఎన్ని గుండెల్రా! ?"

అంటూనే ఆఫీసు రూం కిటికీ తలుపు అద్దం పైన కర్రతో ఫెడీమనిపించాడొకటి. భళ్ళుమంది అది. ముందుకెళుతూ అరుస్తూ, కనిపించిన ప్రతి వస్తువుని ధ్వంసం చేస్తున్నారు.

క్లాసుల నుంచి స్టూడెంట్స్ తలా ఒక దిక్కుకు పారిపోతున్నారు. కొందరు ఆడ పిల్లలు ఏడుపు లంకించుకున్నారు. ఎటూ పోలేకపోయిన అబ్బాయిలు బిక్కచచ్చి చూస్తున్నారు.

"ప్రిన్సిపాలు గాడి గదెక్కడ్రా?!" అరిచాడొకడు.

"అదిగో.. ఆ చివరదే... ఎవరిదో జవాబు.

తలుపులు, కుండీలు, నీళ్ళ కుండలు పగలకొడుతూ బిల్డింగ్‌కు ఆ చివర వున్న ప్రిన్సిపాల్ గారి రూం దగ్గరికి వెళ్ళారు.

పైన దిగ్గొట్టిన 'ప్రిన్సిపాల్' అన్న నేమ్ ప్లేట్‌ను ఎగిరి లాగాడొక్కడు.

ఇంకొకడు అందుకుని గ్రౌండ్‌లోకి విసిరాడు.

అప్పటికి మేమంతా క్లాసుల నుంచి, స్టాఫ్‌రూం నుంచి కిందకు వచ్చేశాం. వాళ్ళు పైకొస్తే ప్రమాదం. ల్యాబ్సన్నీ పైన్నే వుంటాయి.

మమ్మల్ని చూస్తే మరీ రెచ్చిపోయారు.

"ఎవడా రేబాన్ కళ్ళజోడు రెడ్డిగాడు! ఏ క్లాసు? ఎక్కడుంటాడు?"

ఎవరు? ఆ పిల్లని చూసి దువ్వెన తీశాడంట! బాపనోడు చెప్పండి. గొరిగేస్తాం నా కొడుకుని. ఆడి తాతల్లాగే తద్దినాలెట్టుకు బతుకుతాడు!"

"దళితులంటే లోకువురా మీకు!"

"ఆ ఏడిపించిన లం..కొడుకుల అమ్మనో, చెల్లినో, పెళ్ళాన్నో ఏడిపిస్తే ఏం చేస్తారు?"

తరతరాలుగా ఆడవాళ్ళంతా వాళ్ళ నోటి నాటంతో భంగి తమానితులవుతున్నారు. కర్ణకఠోరమైన బూతులు.

"అది కాదు మిస్టర్!" కామర్స్ నాయుడు ఏదో సర్ది చెప్పబోయాడు.

## టెలిస్కోప్

నా దగ్గర బ్రహ్మాండమైన ఓ టెలీస్కోప్ వుంది. దాంతో వెయ్యి మైళ్ళ దూరంలో ఉన్న అమ్మాయిల్ని స్పష్టంగా చూడొచ్చు గొప్పగా చెప్పాడు ఓ వ్యక్తి తన మిత్రుడితో.

అమ్మాయిలు వెయ్యి మైళ్ళ దూరంలో వుంటే లాభమేమిటి? నిరుత్సాహంగా అన్నాడు ఆ స్నేహితుడు.

— కాట్రగడ్డ వెంకట్రావు.

"ఏది కాదురా నాకొడకా?" తటాల్న కాలెత్తాడొకడు.

వెనక్కి తగ్గిపోయాడు నాయుడు.

"ఏమిటయ్యా! మీరు చదువుకునే పిల్లలేనా? ఇంత దౌర్జన్యమా?" పి.డి. రామం గారు ఏదో అనబోయాటు.

పెద్ద బూతు సత్కారంతో నోరు మూయించడానికి ఎంతో సమయం పట్టలేదు వాళ్ళకి.

"అది కాదు.. .." ఆపబోయారు అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రభాకరం గారు.

"తప్పకో ఎహె?" మెడ పట్టి గెంటి ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళారు చాలామంది.

అదృష్టం!. లోపల ఆయన లేదు.

ఫ్యాన్ పటపటమంది. విద్యార్థుల ప్రతిభా పాటవాలకు గుర్తుగా దాచిన షీల్డుల షోకేసు భళ్ళుమంది.దాదాపు నలభయ్ నిమిషాల వీరంగం తరువాత వెళ్ళిపోతూ ఒక ఆర్డరేశారు.

"వాళ్ళ సంగతి మేం చూస్తాం. ఇవాళ జరిగింది రిపోర్టిచ్చారో- పోలీసులకి గాని, ప్రెస్‌కి గాని.... మీరెవ్వరూ మీ పెళ్ళాం బిడ్డల్ని చూడరు.

***** **** **** "అంతా నీకు గుర్తుందా సత్యన్నారాయణా!" అడిగారు సత్యారావు గారు.

నవ్వుతూ తలూపాను.

అప్పుడు తెచ్చి ఇచ్చాడు ఫోయ్ ఒక పేపరు.

ఫ్రంట్ పేజీలో పైన పెద్ద హెడ్డింగ్.

'యు.పి.లో 'మాయా'జాలం.

కింద మరో లైను.

'బిఎస్.పి.కి బి.జె.పి. మద్దతు. అర్ధరాత్రి ప్రమాణ స్వీకారం'.

తరువాత లక్నో డేట్‌లేన్ వార్త వ్రాశారు.

బిఎస్.పి. నాయకురాలు మాయావతి చేత ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ప్రమాణం చేయించారట!. బి.జె.పి. ప్రముఖులు చాలామంది హాజరయ్యారట. జై శ్రీరామ్, జై భీమ్ అన్న నినాదాలు కలిపి వినిపించడం విశేషమట.

విశేషం కాదూ మరి?

"సత్యనారాయణా ఇక వెడదామా?" సత్యారావు గారు హటాత్తుగా రెడీ అయ్యారు.

అప్పటికి తేరుకున్నట్టున్నాడు రాజగోపాల్.

"ఇంతకీ ఆ అమ్మాయి ఎవరు?"అని అడిగాడు.

"వాళ్ళ ఫాదరు కలెక్టరాఫీసు దగ్గరుంటాడటయ్యా!పేరు..."

రాజగోపాల్ ఏదో కనిపెట్టిన వాడిలా ముఖం పెట్టి అన్నాడు. "బీసీ లీడరా? ఎస్సీ లీడరా?"

"పెద్ద కనిపెట్టావు కాని నన్ను చెప్పనీ. ఆ గొడవ తర్వాత ఆయనా కాలేజీకొచ్చాడు. ఆ.. సుబ్బన్న పంతులు. అదీ, చాగంటి సుబ్బన్న పంతులు. స్టాంపు వెండరు. ఎన్టీఆర్ దెబ్బకి కరణీకం పోయి ఈ వూరొచ్చాడు. ఆయన కూతురే" అన్నారు సత్యారావు గారు.

మాట లేదు రాజగోపాల్‌కి.

పుస్తకాలు అందుకుంటూ మళ్ళీ అన్నారు సత్యారావు గారే." అది కాదు సత్యనారాయణా! కాస్త నల్లగా వుంటేనో, బీసీ పిల్లలతో తిరిగినంత మాత్రం చేతనో ఆ సైనల్ మంద అంత గుడ్డిగా ఏడవాలటయ్యా! మాట వరసకి చెబుతాను...."

మళ్ళీ చర్చ మొదలవుతుందనిపించి చటుక్కున లేచి బయలుదేరాను. సత్యారావు గారూ లేచారు.

మాయాజాలం వార్త చదివి ఆ డెబ్బయ్ మందితో పాటు ఇంకెంతమంది నోళ్ళు వెళ్ళబెట్టారో తెలియదు కాని, రాజగోపాల్ మాత్రం సత్యారావు గారి చివరి మాటకి నోరు వెళ్ళబెట్టాడు. దానికి ముందు అతడి నోటి నుంచి వచ్చిన మాట మాత్రం మాకు స్పష్టంగానే వినిపించింది. అదే........

"బ్రామ్మిన్ గాళ్........?!"

